# మానవుని స్వస్థానం బ్రహ్మానందం

తెల్లవారి లేచినది మొదలు ఎవరి నోట విన్ననూ 'హేపీ బర్త్‌డే' అంటున్నారు. దీని అంతరార్థమేమి? అర్థమును గుర్తించి పదములు ఉచ్చరిస్తున్నారా? లేక, ఏదో లౌకిక వ్యవహార రీత్యా ఈ మాట చెబుతున్నారా? అని సందేహము కలుగుతుంది. ఆంగ్లభాషలో 'హేపీ' అనగా సంతోషము అని అర్థము. సంతోషమనే పదమునకు నిర్వచన మేమిటి? 'తోష' అనగా ప్రసన్నత. 'తోష' అనేది హృదయంలో ఉన్న ప్రకృతిని ప్రకటించేది.

**కోరికలు క్షీణించినప్పడే మానవునికి సంతోషము**

సంతోషమునకు మూలము త్యాగము. దుఃఖమునకు కారణము ఆశ. ఈ ఆశ రెండు విధములు. ఎవ్వరికీ కలుగనటువంటి ఫలితములు, వస్తువులు తనకు లభించాలని ఆశించడము ఒకటి. తనకు లభించి నటువంటి ఆనందముగాని, సుఖముగాని, వస్తువులుగాని మరొకరికి లభించరాదని ఆశించడము రెండవది. ఈ రెండూ హాస్యాస్పదమైనవి. ఆశ మానవుని నీడవంటిది. ఈ నీడను ముందుంచుకొని తాను శరవేగంతో పరుగిడినా కూడా నీడను అందుకొనలేడు. ఈ నీడను వెనుకకు నెట్టినప్పుడే అది తనను అనుసరిస్తుంది. కనుక, ఆశలను ముందుంచుకొని ఎన్ని ప్రయత్నములు సల్పినప్పటికీ వాటిని మనము తీర్చుకొనలేము. ఆశలను వెనుకకు నెట్టి ప్రయాణము చేసినప్పుడు ఫలితము మనలను వెంటాడుతూ వస్తుంది. ఆశ లోభముచే కలిగే ఫలితము. లోభము క్షీణించే కొలదీ ఆశ క్షీణిస్తుంది. ఆశ, లోభములు క్షీణించినప్పుడు కోరికలు తమంతట తాము క్షీణిస్తూ పోతాయి. ఎప్పుడు కోరికలు క్షీణిస్తాయో అప్పుడు మానవునికి సంతోషము ప్రాప్తిస్తుంది.

**ఆనందము మానవుని సహజ స్వభావము**

నారాయణుని నమ్ముకొన్నవాడు ప్రహ్లాదుడు. నామరూపములను నమ్ముకొన్నవాడు హిరణ్యకశిపుడు. నారాయణుని నమ్ముకొన్న ప్రహ్లాదునికి నిరంతరము ఆనందమే. నామరూపములను ఆశ్రయించినటువంటి హిరణ్య కశిపునికి నిరంతరము విచారమే. ఆనందమును అనుభవించేవారి ముఖ వర్చస్సు ఎంతసేపైనా చూడవలెననిపిస్తుంది. అది చూసేవారికి కూడా ఆనందాన్ని కలిగిస్తుంది. విచారపడేవాని ముఖము వికారంగా తయా రవుతుంది. ఆనందము మహాబలమును అందిస్తుంది. విచారము సమస్త బలమును సన్నగిల్లజేస్తుంది. కనుక, ఆనందనేటటువంటిది కేవలము కృత్రిమమైనటువంటిదిగాని, కల్పితమైనటువంటిదిగాని కాదు. ఆనందము నిమిత్తమై అనేక సాధనలు చేయవలసిన అవసరము లేదు. తానే ఆనంద మయుడై ఉన్నాడు. తన సత్యాన్ని తాను గుర్తించుకోలేకపోవడంచేతనే బయటి ఆనందమునకై ప్రాకులాడుతున్నాడు. నిత్య సత్య నిర్మలమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించుకొన్న వ్యక్తి తానే ఆనందమునకు ఆలవాలమై ఉంటాడు. 'ఆనందో బ్రహ్మేతి' అనే తత్త్వమును భగవద్గీత అనేక విధములుగా బోధిస్తున్నది. ఆనందము ప్రహ్లాదుని పేరులోనే ఉన్నది. హ్లాదము అనగా ఆనందము. 'ప్ర' అనగా పరిపూర్ణమైన ఆనందము. పరిపూర్ణ మైన ఆనందముతో కూడినటువంటివాడు ప్రహ్లాదుడు అని అర్థము. ఈ పరిపూర్ణానందము ప్రహ్లాదునికి ఎక్కడినుండి లభించింది? నామరూపములు విసర్జించి, ఆత్మతత్త్వమునే లక్ష్యమునందుంచుకొని నారాయణ తత్త్వములో తన మనస్సును లీనం గావించడంచేత తాను ఆనందమయుడిగా రూపొందినాడు. ఇట్టి స్థితి మానవునికి నిద్రావస్థయందు అనుభూతిలోకి వస్తుంది. గాఢనిద్రయందు మానవుడు ఎట్టి రూప నామములను జ్ఞప్తియందు ఉంచుకొనక సర్వేంద్రియముల సంబంధమును కోల్పోవడం చేత పూర్ణానందమును అనుభవిస్తుంటాడు. దీనినే 'సుషుప్తి' స్థితి అంటారు.

మానవునికి ఆనందము సహజ స్వభావము. ప్రతి మానవుడు నిరంతరము ఆనందమునే ఆశిస్తుంటాడు. నిద్రనుండి లేచి పరుండేంత వరకు తాను ఆనంద జీవితమును అనుభవించాలని కోరుతుంటాడు. అయితే, ఈ ఆనందము ఎక్కడ ఉన్నదనే సత్యమును మాత్రము గుర్తించ లేకపోతున్నాడు. ఈనాటి సమస్త విద్యలు, ఆస్తిపాస్తులు, ఉద్యోగములు, స్థాయిలు భౌతికమైన ఆనందమును అనుభవించే నిమిత్తమే. ఆనందము యొక్క మూలస్థానము ఏమిటి? మానవుడు ఎట్టి ఆనందమును అనుభవించినా అవన్నీ కేవలము బ్రహ్మానందముయొక్క అంగములే. ఇప్పుడు శ్రీమంతుని గృహమునందు సిరిసంపదలు అనేకముగా కనిపిస్తున్నప్పటికీ ఈ సంపదలకు ఆలవాలమైనది లక్ష్మియే. అట్లే, ఈ లోకమునందు మానవుడు అనుభవించే ఇంద్రియానందము, విద్యానందము, భావానందము, మానసికానందము మొదలైన సర్వానందములు బ్రహ్మ స్థానమునుండి వెలువడిన కిరణములే. ఉపాధి భేదములు పురస్కరించుకొని ఆనందము పరిపరి విధముల రూపొందింపజేస్తున్నదేగాని, ఆనంద నిలయము ఒక్కటే.

**ఆనందము భగవత్స్వరూపమని గుర్తించాలి**

బావి, కుళాయి, చెరువు దేనినుండి తెచ్చినా నీరు నీరే. ఉపాధి భేదమును బట్టి బావినీరు, కుళాయినీరు, చెరువునీరు అంటున్నాము. అట్లే, ఇంద్రియానందము, విద్యానందము, సాంసారిక విషయానందము అన్నీ బ్రహ్మానందములే, స్వభావములే. సమస్త పదార్థములలో ఆనందము అంతర్భూతమై ఉంటుంది. కనుక, ఆనందము భగవత్స్వరూపమని గుర్తించడం అత్యవసరం.

పదార్థమునందు కూడా సత్, చిత్, ఆనందాంశములు లీనమై ఉంటాయి. తన కళ్ళ ఎదుట ఎందరో మరణిస్తున్నా తాను శాశ్వతంగా జీవించాలని, జబ్బు వచ్చినా నివారణ గావించుకొని మరికొంతకాలము జీవించాలని ప్రతి వ్యక్తి ఆశిస్తాడు. శాశ్వతంగా ఉండాలనేది 'సత్' స్వభావము. 'చిత్' అనేది అన్నింటినీ తెలుసుకోవాలనే సంకల్పమును అభివృద్ధి పరుస్తుంది. ఇక, ఆనందము. దీనిని కోరనివారుండరు. 'సత్', 'చిత్', 'ఆనందము'లు మానవునియొక్క స్వభావములే. ఇందులో ఒకటి బింబము, మరొకటి ప్రతిబింబము. 'సత్'లోకూడా అంతర్ముఖము ఒకటి, బహిర్ముఖము ఒకటి. ఇవే Being and Becoming. తనయందున్న దివ్యత్వాన్ని ప్రసారం చేసేది Becoming తనయందు లేకపోతే ప్రసారము చేయ వీలుకాదు కదా! తనయందున్న శాశ్వత సత్యము 'సత్'. ఈ జగత్తులో మనము చూసే ప్రతి పదార్థము మనలోపల ఉండేదాని ప్రతిబింబము. Reflection of the Inner Being జగత్తు అంతా Becoming. దీనికి ఆధారమైన దివ్యత్వము Being. ఈ శాశ్వతము, ఘనత్వము ఒకదాని కొకటి ప్రతిబింబములు. ఒకటి చరము, రెండవది స్థిరము. తెరపైన బొమ్మలు వస్తుంటాయి, పోతుంటాయి. పోనిది, రానిది, శాశ్వతమైనది తెర. వచ్చిపోయే బొమ్మలు క్షణికత్వము. ఈ రెండింటియొక్క సంబంధము అన్యోన్యాశ్రయము.

ఈ జగత్తంతాకూడా క్షణభంగురము. అయితే, దీనినే 'జాగ్రత' అన్నారు. జాగ్రతకు స్థూలమైన దేహము అత్యవసరము. ఇది అన్నమయము. ఇక సూక్ష్మమైనవి మనోమయ, విజ్ఞానమయములు. ఈ రెండింటికీ ప్రాణమయము ఆధారము. ఈ మూడూ చేరినటువంటిది సూక్ష్మదేహము. స్వప్నావస్థయందు దీని అనుభూతి కలుగుతుంది. ఇక, ఐదవది ఆనంద మయము. ఇది కారణస్వరూపము. కారణస్వరూప తత్త్వము నిజమైన ఆనందము.

ఇక, 'చిత్' సూక్ష్మ రూపములో ఉంటుంది. 'చిత్' ఎవేర్‌నెస్. దీని ప్రక్కన శక్తి ఉంటుంది. ఈ 'సత్', 'చిత్', 'ఆనందము'లకు అంతర్ బహిర్ భావములు రెండూ ఉంటాయి. స్థూల, సూక్ష్మ, కారణ రూపము లైనటువంటి దైవత్వము అనేక రూపములలో ఉంటూ ప్రకాశిస్తున్నది. ఒకటి నిమిత్తకారణము, రెండవది ఉపాదాన కారణము. నిమిత్తమే లేకపోతే ఉపాదాన కారణము ఉండదు. ఉపాదాన కారణమే లేకపోతే నిమిత్తము రాణించదు. ఇవి

రెండూ అన్యోన్యాశ్రయములు.

**ఇంద్రియానందము క్షణభంగురమైనది**

ఇంద్రియముల ఆనందము క్షణభంగురము. ఆకలికి ఆహారము తీసుకోగానే ఆనందము కలుగుతుంది. కాని, రెండు మూడు గంటలు కాగానే తిరిగి ఆకలి వేస్తుంది. మళ్ళీ ఆహారం కావాలి. వెన్నెలను అనుభవిస్తూ చకోర పక్షులకు కూడా విసుగు కలుగవచ్చు. అదేపనిగా ఆరగిస్తుంటే, అమృతం కూడా చేదు కావచ్చు. కాని, బ్రహ్మానందం ఈరకంగా విసుగు పుట్టేది కాదు. బ్రహ్మానందము మానవుని స్వస్థానము. విలువైన రాళ్ళు పొదిగిన బంగారు గిన్నెలో జలం లేనిది చేపకు ఆనందము లేనట్లు, సమస్తము ఉన్న విశ్వములో మానవునికి శాశ్వతానందము లేదు. తన స్వస్థానమైన బ్రహ్మానందము నిమిత్తమై మానవుడు పరితపిస్తున్నాడు. విషయానందము బ్రహ్మానందానికి సంబంధించినదే అయినా అది స్వస్థానము మాత్రము కాదు. సముద్రమునుండి ఉద్భవించిన నదులు తిరిగి సముద్రమును చేరడానికే ప్రవహిస్తున్నవి. అదేవిధముగా, బ్రహ్మానందము నుండి ఆవిర్భవించిన మానవ జీవిత ప్రవాహము తిరిగి బ్రహ్మానందమనే స్వస్థానమును చేరేంతవరకు శాశ్వత శాంతి లభించదు.

అట్లే, విద్యానందముకూడా. సంగీత, సాహిత్య, చిత్ర, శిల్ప, నాట్య కళలన్నీ కూడా క్షణభంగురమైన ఆనందాన్నే అనుభవింపజేస్తాయి. త్యాగరాజు సంగీత, సాహిత్యాలలో తన్మయత్వము పొందినా శాశ్వతానందము నిమిత్తమై పరితపించినాడు. లోకములోని వస్తువులు సమస్త సుఖాలను అనుభవింపజేస్తాయని మనము భ్రమిస్తున్నాము. అనుభవింపజేస్తాయి, నిజమే! కాని, శాశ్వతానందాన్ని కాదు.

**బ్రహ్మానందమే నిజమైన ఆనందము**

దైవము, దైవము అంటూ ఎక్కడో ఉన్నాడనే భ్రాంతిని మీరు మరచిపోవాలి. నీవే దైవము, నీవే సచ్చిదానందము, నీవే అస్తి, భాతి, ప్రియము. ఎప్పుడు భ్రాంతిని వదలుకుంటావో అప్పుడే నీవు సత్య స్వరూపుడవవుతావు. ఈ సచ్చిదానందమును అనుభవించాలనే భావము మీకుంటే, దీనిని మీరు నిరంతరము స్మరిస్తూ వుండాలి.

**"నేను దైవంబు తద్భిన్నమేమి కాదు**
**ఆ అఖండ పరబ్రహ్మమౌదు నేను**
**వ్యథ, క్లేశముల్ నన్ను స్పృశింపబోవు**
**సచ్చిదానందమును, తద్భిన్నము కాను**
**నిత్య తృప్తుడనగుదు, భీతి నన్ చేరబోదు**
**ఉల్లమా! పల్కు ఓం తత్సత్తటంచు"**

'నేను అల్పుడను, అశక్తుడను, హీనుడను, క్షుద్రదేహమును ధరించిన వాడను', అనే బలహీన భావములను ఏమాత్రము హృదయములో చేర్చరాదు. దేహము కేవలము ఒక ఉపాధి. ధర్మార్థ కామమోక్షములను అనుభవించి, ఆదర్శవంతమైన మార్గాన్ని ఇతరులకు అందించేందుకై ఈ దేహము ఏర్పడినదేగాని, తిండి నిద్రలకోసము కాదు. ఆనందము లేని జీవితము ప్రాణము లేని దేహము వంటిది. ఆనందమంతా బ్రహ్మానందము నుండి లభించేదే.

అయితే, బ్రహ్మతత్త్వమును గుర్తించుకోవడానికి, బ్రహ్మానందమును అనుభవించడానికి కొన్ని సాధనలు చేయాలి. ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా అన్నీ అంతర్భూతమునుండి ఆవిర్భవించేవే. స్థూలదేహముతో ఎన్ని అనుభవించినా అవి మనలను గమ్యము చేర్చలేవు. సూక్ష్మస్వరూపమైన ప్రాణ, మనో, విజ్ఞానతత్త్వములను

స్థూలదేహములో ఇమడ్చాలి. జీవిత తత్త్వమునే దైవతత్త్వముగా మార్చుకోవాలి. దైవమునుండి ఆనందాన్ని అందుకొనే నిమిత్తం భగవంతునితో వ్యాపారంలో ప్రవేశించరాదు. ప్రార్థనల చేత దైవమును ప్రసన్నుని గావించుకొని తద్వారా అభీష్టములను తీర్చుకుందామనుకోవడం శుద్ధ అపమార్గము. భగవంతునినుండి ఫలితము పొందాలనే లక్ష్యాన్ని విసర్జించాలి. అనాది కాలమునుండి ఆస్తికులు ఈ భ్రాంతిలో మునిగి అపమార్గమును అనుసరించి, అశాంతి పాలవుతున్నారు.

**వ్యావహారిక జీవితము, పారమార్థిక జీవితము రెండూ వేరు కాదు**

దేహమెంత అశాశ్వతమో దేహంద్వారా పొందే ఆనందములుకూడా అంత అశాశ్వతమైనవి. ఆత్మతత్త్వమైన ధ్యాననిష్ఠలో అనుభవించే ఆనందము దైవతత్త్వముతోకూడినది కనుక, దైవము ఎంత సత్యమో ఆ ఆనందము కూడా అంత సత్యము. ఏ పని చేసినా భగవత్ప్రీత్యర్థమనే భావముతో అర్పితం చేయాలి. 'ఇది నాపని, ఇది దైవం పని' అని భేదభావములు పాటించరాదు. దైవమునకు ఉపాధులున్నా, ఆ ఉపాధులు అవస్థలకు గురి కావచ్చుగాని, ఆత్మతత్త్వము మాత్రము ఎట్టి అవస్థలకూ గురి కాదు. 'వ్యావహారిక జీవితము వేరు, పారమార్థిక జీవితము వేరు', అని అంటూంటారు కొంతమంది. ఇవి రెండూ వేరు కావు; ఒక్కటే.

**దేహమందు జీవుడుండు, హృదయమందు దేవుడుండు**<br>
**రెండు కూడి ఆటలాడి ఒకరినొకరు వీడుచుండ్రు**<br>
**బొమ్మలాట లాడించే సూత్రధారి ఒకడు కలడు**<br>
**ఒకటిలోనె రెండు ఉండు, రెండు చేరి ఒకటి అగును**

ఒక గింజలో రెండు బద్దలుంటాయి. ఆ రెండూ చేరి ఒక్కటే. జడము, చైతన్యము రెండూ ఏకస్వరూపాన్ని ధరించినవే. పారమార్థికము, వ్యావహారికము రెండూ వేరు కావు. ఒకే గింజలో రెండు బద్దలవంటివి. ఈ విధముగా భావించి, నిత్యజీవితములో ఆచరణబద్ధమైన మార్గమును అనుసరించినప్పుడే నిజమైన బ్రహ్మానందము లభిస్తుంది.

**భగవంతునికి కావలసినది నిర్మల ప్రేమ, నిస్వార్థ సేవ**

దేహము నీటిబుడగ వంటిది. ఐతే, ఉన్నంతవరకు దీనితో సార్థక కర్మలను ఆచరించవలసినదే. ధనమువలన సుఖము లభిస్తుందని భావించరాదు. గుణమువల్లనే సుఖము లభించేది. కనుక, సద్గుణవంతులు కావడానికి ప్రయత్నించాలి. సదాచార మార్గములో ప్రవేశించాలి. సద్భావాలు పెంచుకోవాలి. అన్నింటికంటే ప్రధానమైనది సేవామార్గము. ఎవరికి సేవ చేసినా ఈశ్వరసేవగా భావించాలి. ఎవ్వరినీ దీనులు, దిక్కు లేనివారు, అనాథలని భావించవద్దు. 'నాథనకే నాథ అనాథ నాథ'. అందరికీ నాథుడు దేవుడు. దేవునికి ఏ నాథుడూ లేడు. నిజంగా అనాథుడంటే దేవుడే. మీరందరూ శక్త్యనుసారము సమాజసేవలు చేస్తూ, కష్టములలో, దుఃఖములలోనున్న ప్రజలను ఆదుకోవడానికి ప్రయత్నించండి. శారీరక, మానసిక శక్తులుండికూడా చాలామంది యువకులు తిని, తిరుగుతున్నారే తప్ప సంఘసేవకు పూనుకోవడం లేదు. తన పొట్టనే కైలాసంగా, ఇనప్పెట్టెనే వైకుంఠంగా, తన సుఖమే స్వర్గసుఖంగా భావించుకుంటే... అది కేవలము రాక్షసత్వమే అవుతుంది. స్వర్గము, వైకుంఠము, కైలాసము అన్నీ మనం చేసే కర్మలలోనే ఇమిడియున్నాయి. సుఖదుఃఖాలకు కూడా మన కర్మలే మూలకారణము. పాపం చేసినా సుఖంగానే ఉన్నానని విఱ్ఱవీగవద్దు. పాపముయొక్క బీజము ఫలవృక్షము కావడానికి కొంత సమయము పడుతుంది. చిట్టచివరకు ఫలితము అనుభవించక తప్పదు. పాపము చేస్తూ పాపఫలము వద్దంటున్నాము. పుణ్యకార్యము చేయకుండా పుణ్యఫలము కోరుతున్నాము. ఇట్టి మానవులలో

దివ్యత్వము ఏవిధంగా ప్రకాశిస్తుంది?

గ్రంథములు చదివినంతమాత్రమున, ఉపన్యాసాలు విన్నంత మాత్రమున ప్రయోజనం లేదు.

**'ఆకొన్నవాని ఆకలి తీరునా పంచభక్ష్యముల పాకమ్ము విన్న?**
**నిరుపేదవాని పేదరికము పోవునా విత్త ప్రభావంబు విన్నయంత?**
**అంధకారంబెల్ల హతమారునే చూడ వసుధలో దీపపు వార్తవలన?'**

ఈనాడు అందరూ వేదాంతులే, గ్రంథాలు చదివేవారే! భక్తులే! కాని, ఆచరణలో ఎక్కడా దీని ప్రభావము కనిపించడము లేదు. కేవలము ఇది మాటల మేజిక్కు కాదు. క్రియాశూరులు కావాలి. దైవవిషయాలు ఎన్ని చెప్పినా ఆచరణ లేనివాడు దైవద్రోహి. దైవత్వాన్ని విశ్వసించినప్పుడు ప్రతి కార్యాన్ని దైవత్వంగా భావించి, ఆ కార్యాచరణకు కంకణం కట్టుకోవాలి. భగవంతునికి కావలసినది నిర్మలమైన ప్రేమ, నిస్వార్థ సేవ. ఈ రెండూ భగవంతునికి అర్పితం చేస్తిరా, సర్వస్వము మీకు లభిస్తుంది. సత్యసాయి సేవాసంస్థలద్వారా అనేక రాష్ట్రాలలో నిర్మాణకార్యక్రమాలు చాలా చేస్తున్నారు. ఇంకా, ఉత్సాహంగా అధికమైన కాలాన్ని సేవకు వినియోగించాలి. క్షణభంగురమైన జీవితాన్ని పేరు, ప్రతిష్ఠలకోసం వినియోగించరాదు.